క్లుప్తంగా

క్రైస్తవుల రక్షణకు గవర్నర్ ఆదేశం


క్రిస్టియన్ మైనారిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ కుమార్

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్రైస్తవుల రక్షణకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఏపీ డీజీపీకి ఆదేశాలు జారీ చేశారనీ ఏపీ వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.జీవన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పరిణామం రాష్ట్రంలో క్రైస్తవులు మద్దతుదారులు అందరి సమష్టి కృషి ఫలితం అన్నారు. రాష్ట్రంలో క్రైస్తవుల పై మతపరమైన దాడులు పెరగడం క్రైస్తవుల ఆందోళన వినతి నేపథ్యంలో సుప్రీంకోర్టు నిబంధనలు అనుసరించి క్రైస్తవుల రక్షణకు రాష్ట్ర గవర్నర్ సెక్రటరీ హరి సింగ్ నాయక్ డీజీపీకి లేఖను పంపారు. ఇప్పటికే హైకోర్టులో క్రైస్తవులపై మతపరమైన దాడులు నష్టాలను వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ పాస్టర్ ఫెడరేషన్ అడ్వైజరీ బోర్డ్ మెంబర్ ఏపీ హైకోర్టులాయర్స్ ఫ్రంట్ అధ్యక్షులు జి రోనాల్డ్ రాజు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి విదితమేనని జీవన్ కుమార్ అన్నారు.

గోదావరి కాలువలో ఆధునికీకరణ పనులు



గోదావరి కాల్వను వెడల్పు చేస్తున్న దృశ్యం

దెందులూరు: గోదావరి కాలువను ఎనిమిది ప్రొక్లెయిన్లతో రెండు వైపులా ఆధునీకరణ పనులు చేస్తున్నామని డీసీ చైర్మన్ వెలమాటి రాంబాబు అన్నారు. శనివారం ఇరిగేషన్ గోదావరి సెక్షన్ జూనియర్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం తో కలిసి గుండుగొలను, సత్యనారాయణపురం, కొవ్వలి, దెందులూరు వద్ద జరుగుతున్న గోదావరికాలువ గట్లు ఆధునీకరణ వెడల్పు పనులను పరిశీలించారు. శివారు ఆయుకట్టు ప్రతి రైతు భూమికి పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు తమ పూర్తి సహాయ సహకారాలు అధికారుల పర్యవేక్షణలో చేయడం జరుగుతుందన్నారు. త్వరితగతిన ఆధునికరణ పనులు పూర్తయ్యేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

ముడి పామాయిల్ దిగుమతి సుంకం పెంచాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముడి పామాయిల్ దిగుమతి సుంకం పెంచాలని ఏలూరులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ, దిగుమతి సుంకాన్ని 40 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, పామాయిల్ రైతుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం ఈ సమావేశం ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సోమశేఖరాచార్యులు అధ్యక్షతన నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ మిల్లర్లకు, దళారులకు వ్యవసాయ ఉత్పత్తులను అమ్మకం చేసుకున్న తర్వాత ప్రభుత్వాలు ధర నిర్ణయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. టన్ను పామాయిల్‌కు రూ.22 వేలు మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. పలు సంఘాల నేతలు కేవీపీ ప్రసాద్, పి.జమలయ్య, ఆర్.లక్ష్మణరావు, డి.ప్రభాకర్, ఎం.వసంత రావు, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ బేస్ క్యాంపు హెల్పర్లను ఢీ కొట్టిన వాహనం


క్షతగాత్రులను ఆసుపత్రి తీసుకువెళ్తున్న దృశ్యం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం గుడివాడలంక సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫారెస్ట్ బేస్ క్యాంప్ హెల్పర్స్‌ను బొలెరో వాహనం ఢీ కొట్టి ఆగకుండా వ్యాన్ డ్రైవర్ వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఫారెస్ట్ బేస్ క్యాంప్ హెల్పర్స్ జి.నాగన్న, ఎన్ సహదేవుడుకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. బాధితులను కుటుంబ సభ్యులు, బంధువులు స్థానికులు హుటాహుటిన ఏలూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారు చికిత్స పొందుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అశోక్ తేజకు ఘన స్వాగతం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆదివారం నగరంలో నిర్వహించనున్న శ్రమకావ్య గానం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏలూరుకు చేరుకున్న జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ కవి, ఉత్తమ సినీ గేయ రచయిత, సుద్దాల అశోక్ తేజకు ఘనస్వాగతం లభించింది. తొలుత సీఐటీయూ నాయకులు ఆర్. లింగరాజు, డీఎన్వీడీ ప్రసాద్ అశోక్‌తేజను ఆయన విడిది ప్రాంతంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు. భూపతి అప్పారావు, దోనే వెంకటేశ్వరరావు తదితరులు కలిసి ఆయనను అభినందనలు తెలిపారు.

ఏడాది పాలన..సూపర్ ఫ్లాప్

- అందని ద్రాక్ష... నిరుద్యోగ భృతి
- నెరవేరని కూటమి ప్రభుత్వ హామీలు
- కార్యాచరణకు నోచుకోని సూపర్ సిక్స్ పథకాలు
- పాలకుల తీరుపై ప్రజల మండిపాటు



దెందులూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి చంద్రబాబునాయుడు కోకొల్లలుగా హామీలు గుప్పించారు. గద్దెనెక్కిన వెంటనే సూపర్ సిక్స్ వంటి హామీలు అమలు చేస్తామని ప్రకటించారు. అయితే అధికారంలోకి వచ్చి నేటికి ఏడాది పూర్తవుతున్నా ఇప్పటికీ హామీలను నెరవేర్చలేని పరిస్థితి. కనీసం సూపర్ సిక్స్ పథకాలైనా అమలు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు నిరుద్యోగ భృతిపై ఎప్పటికప్పుడు ప్రకటనలు గుప్పిస్తున్నా అమలు ఊసేలేదు. తల్లికి వందనం పథకం ఏడాదిగా అమలుకు నోచుకోవడం లేదు. రైతులు పెట్టుబడులు పెట్టే సమయం వచ్చినా ఇంతవరకూ అన్నదాత సుఖీభవకు దిక్కే లేకుండా పోయింది.

గత ప్రభుత్వంలో...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నవరత్నాల పేరిట పర్గలకు తంథన్‌గా సంక్షేమ పథకాలు అందేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పార్టీలకతీతంగా పథకాలు అమలు చేయడంతో పాటు నేరుగా వారి ఖాతాల్లోకే నగదు జమచేశారు. రెండేళ్లు కరోనా వ్యాప్తి చెందడంతో ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలు అమలు ఏమాత్రం ఆపలేదు. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల కోసం ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన చంద్రబాబు ఒక్క పథకం కూడా అమలు చేయడం లేదు. అచరణ సాధ్యం కాని హామీలిచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చని కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు.

కాలయాపన తగదు..



ఏడాది పూర్తవుతున్నా సంక్షేమ పథకాలు అమలు చేయకుండా అబద్ధపు మాటలతో కాలయాపన చేస్తున్నారు. ఎంతమంది పిల్లలున్నా వారందరికీ తల్లికి వందనం పథకం కింద రూ.15వేలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదు. సూపర్ సిక్స్ పేరిట ఉన్న పథకాలన్నీనిలిపేశారు.

గొల్ల కిరణ్, నిరుద్యోగి, కొవ్వలి.

సాయమేదీ?



ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగులు ఇస్తామని, ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగులు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రకటించారు. ఇప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా నిరుద్యోగులకు కల్పించలేదు. డీఎస్సీ అన్నారు అదీ లేదు. మరోవైపు వివిధ శాఖల్లో ఖాళీలు అధికంగా ఉన్నాయి. నిరుద్యోగులకు తీరని మోసం జరుగుతుంది.

గంటా పండు, మాలమహానాడు రాష్ట్ర నాయకుడు కొమిరేపల్లి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలులోని 33 కేవీ సెక్షన్ పరిధిలోని భీమడోలు, గుండుగొలను, ఆగడాలలంక సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 8వ తేదీ ఆదివారం మొక్కలు తొలగింపు, మరమ్మతులు నేపథ్యంలో ఉదయం 6.30 నుంచి 8.30 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శివాజీ శనివారం రాత్రి తెలిపారు. గుండుగొలను ఇండస్ట్రియల్, నాగహనుమాన్ ఇండస్ట్రియల్, సూరప్పగూడెం అగ్రి కల్చరల్, పోలసానిపల్లి అగ్రికల్చరల్, సూరప్పగూడెం హెడ్ క్వార్టర్ ఫీడర్లకు, కోరుకల్లు, గుండుగొలను, రత్నాపురం, ఆగడాలలంక ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. భీమడోలు, పోలసానిపల్లి, సూరప్పగూడెం,పాతూరు, దిగులుపాటి దిబ్బ, కోరుకొల్లు, గుండుగొలను, రత్నాపురం, ఆగడాలలంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

బ్యాంకు భద్రతపై ఉచిత శిక్షణ

దెందులూరు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏలూరు ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి సీసీటీవీ కెమెరా సెక్యూరిటీ అలారం కోర్సులు 13 రోజుల శిక్షణ ఇవ్వడం జరుగుతుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది తెలిపారు. శనివారం గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారంలో భాగంగా దెందులూరులో వారు మాట్లాడుతూ13 రోజులు పాటు శిక్షణ ఉంటుందన్నారు , ఉచిత భోజనం హాస్టల్ వసతి ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి ఉన్నవారు 950 27 23561,9014040780, 9533079471 సెల్ ఫోన్ నెంబర్లు రిజిస్టర్ చేసుకుని సంప్రదించాలని సూచించారు.

9న ఆయిల్ పామ్ రైతుల ధర్నా

ఏలూరు(ఆర్ఆర్‌పేట): పామాయిల్ దిగుమతులపై సుంకం 50 శాతం పెంచి ఆయిల్ ఫామ్ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ఆయిల్ ఫామ్ రైతులు నిర్వహిస్తున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతి సుంకం 10 శాతం తగ్గించడం వల్ల ఆయిల్ ఫామ్ గెలల ధరలు తగ్గిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల రీత్యా టన్ను ఆయిల్ ఫామ్ గెలలు రూ.22 వేలు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. పెదవేగి ఆయిల్ షెడ్ కర్మాగారం ప్రైవేట్ పరం చేయాలని ఆలోచన వెంటనే విరమించుకోవాలన్నారు.

విజేతలకు అభినందనలు


విజేతలను అభినందించిన గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్

దెందులూరు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో వివిధ విభాగాల్లో విజేతలను శనివారం వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పోతునూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్ అభినందించారు. 43 రోజులపాటు వేసవి సెలవులను వృథా చేయకుండా విజ్ఞానం ఆట పాటలకు కేటాయించి సమయాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా శ్రద్ధ తీసుకుని విద్యార్థులను సమయం సద్వినియోగం అయ్యేలా గ్రంథాలయాలకు పంపించడం సంతోషంగా ఉందన్నారు. ఆటలు పాటలు వ్యాసరచన వివిధ విభాగాల్లో పాఠశాల జూనియర్ సీనియర్ విద్యార్థులకు బహుమతులు అందించిన పోతునూరు గ్రంథాలయ అధికారి జి రాంబాబును సర్పంచ్ అభినందించారు.

ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రికెట్ పోటీలు ప్రారంభం

దెందులూరు: నాషా ముక్త్ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం ఏలూరు రూరల్ మండలం పాలగుడెంలోని ఆశ్రమం మెడికల్ కళాశాల క్రికెట్ మైదానంలో రెండు రోజుల ఇంటర్ డిపార్ట్‌మెంటల్ క్రికెట్ పోటీలను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రారంభించారు. అనంతరం ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడిన కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ క్రీడాకారులను ప్రోత్సహించారు. తొలుత పోటీలో పాల్గొంటున్న ఆరు జట్ల క్రీడాకారులను కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ పరిచయం చేసుకున్నారు.

అవగాహన కల్పించాలి:

కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించడంతో పాటు మాదక ద్రవ్యాల అమ్మకం, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం నషాముక్త్ భారత్ అభియాన్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. మాదక ద్రవ్యాల సమాచారాన్ని 1972, 14446 టోల్ ఫ్రీ నెంబర్లకు అందించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండేలా అన్ని పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం కారణంగా కలిగే దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎస్పీ ప్రతాప శివకిషోర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం అందరి బాధ్యతని అన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల బారిన పడకుండా యువతను వివిధ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకునేలా చైతన్య పరచాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలు రవాణా చేసే వారిపై కఠినమైన శిక్షలు పడేలా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మీడియా, రెవెన్యూ జట్ల మధ్య తొలి మ్యాచ్ నిర్వహించగా, టాస్ గెలిచి రెవెన్యూ టీమ్ ఫీల్డింగ్ ఎంచుకుంది. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రామ్ కుమార్, డీఎస్ఓ బి.శ్రీనివాసరావు, సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్,


.బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి


బౌలింగ్ చేస్తున్న ఎస్పీ ప్రతాప శివ కిషోర్

సర్వమానవ హితమే మానవత లక్ష్యం

భీమడోలు: సర్వమానవ హితమే మానవత స్వచ్ఛంద సంస్థ లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. భీమడోలు అమ్మవార్ల ఆలయ ఆవరణలో శనివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ భీమడోలు, నల్లజర్ల, చాగల్లు మండలాల 2025-26 నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సమావేశంలో మానవత శాంతి రథాలు, ఫ్రీజర్లు, విద్యానిధి నిర్వహణ, ఆడిటింగ్‌లో ఎదురయ్యే సమస్యలు, సభ్యత్వాల నమోదుపై చర్చించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి కమిటీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఉమ్మడి జిల్లా మానవత శాఖ నూతన అధ్యక్షుడుగా కండెపు సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నల్లజర్ల మానవత డైరెక్టరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన ఎస్.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత ధ్యేయమని, సంస్థ బలోపేతానికి సభ్యులంతా తమ వంతు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత మానవత జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కరరావు, రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, జిల్లా ప్రతినిధులు ఆలపాటి నాగేశ్వరరావు, అప్పక రాంబాబు, రామిశెట్టి గంగాధరరావు, గోనుగుంట్ల రమణశంకర్, అల్లాడ ప్రసాదరావు, ఏ.రమణమూర్తి, వివిధ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి

యూటీఎఫ్ నిరసన

ఉంగుటూరు: ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలకు ఇచ్చిన హామీని ఉల్లంఘించడంపై యూటీఎఫ్ తీవ్రంగా ఖండించింది. ఉంగుటూరు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద యూటీఎఫ్ మండల శాఖ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉనుముల రాంబాబు, డాకి జోగినాయుడులు మాట్లాడుతూ మే 19, 20తేదీలలో పాఠశాల విద్యా కార్యదర్శి కోన శశిధర్ గారి సమక్షంలో జరిగిన చర్చల సందర్భంగా సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీలు చేపట్టడానికి అంగీకరించడం జరిగిందన్నారు. కానీ ఎస్జీటీలకు మళ్లీ వెబ్ ఆప్షన్ పెట్టు కోవాలని శుక్రవారం రాత్రి ఎనేబుల్ చేయడం ఇచ్చిన హామీని ఉల్లంఘించడం అవుతుందని దీనిని ఖండిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు సీతాల సత్యన్నారాయణ, జిల్లాకార్యదర్శి పుప్పాల నరసింహారావు, ఉపాధ్యక్షుడు తూతిక శివయ్య, జిల్లా కౌన్సిలర్స్ అల్లు శ్రీను, బొమ్మిడి ప్రసాద్, సలాది గణేష్, కళ్లపల్లి పోతురాజు, తీడ శ్రీధర్, సింగవరపు శ్రీను, చదరవాడ సురేష్, రేగాన రామకృష్ణ, దామోదర్, పీపీ సత్యన్నారాయణ పాల్గొన్నారు.


ఉంగుటూరులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

త్యాగానికి ప్రతీక బక్రీద్


బక్రీద్‌సందర్భంగా నమాజ్ చేస్తున్న ముస్లిం సోదరులు


భీమడోలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఇమామ్ దిల్షాద్, ముస్లిం సోదరులు

దెందులూరు: బక్రీద్ పండుగను పురస్కరించుకుని మండలంలో గ్రామాల్లో ఉన్న మసీదుల్లో శనివారం ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇతరులు పట్ల ప్రేమ దయతో ఉంటూ అందరి ప్రేమకు పాత్రులు కావాలని సేవా భావంతో జీవించాలని దెందులూరు మసీదు ఇమామ్ సద్దాం హుస్సేన్ అన్నారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దెందులూరు మసీదులో పాటు గంగన్నగూడెం, జోగన్నపాలెం, సీతంపేట, కొవ్వలి, మేదినరావుపాలెం గ్రామాల్లో ఉన్న మసీదుల్లో ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. దెందులూరు మసీదులో ముదవల్లి జహీర్ డాక్టర్ ఈసు, రిటైర్డ్ తెలుగు టీచర్ రెహమాన్ యాకూబ్ లతో పాటు ముస్లిం సోదరులు నమాజులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రకీద్ శుభాకాంక్షలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బక్రీదు

భీమడోలు: త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీదు పండుగను శనివారం ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ తర్వాత ముస్లిం సోదరులు పవిత్రంగా జరుపుకునే పండుగ బక్రీదు. మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పాతూరు, అంబర్‌పేట, పోలసానిపల్లి గ్రామాల్లో బక్రీదు పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. వారంతా ఒకరినొకరుల అలింగనం చేసుకున్నారు. భీమడోలులో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ హసేనా ఆధ్వర్యంలో పరిసర గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్ దిల్షాద్ పండుగ ఆవశ్యకతను వివరించారు. త్యాగంతో పాటు దాతృత్వాన్ని చాటుతూ ఈ పండుగను చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ హసేనా, సైనేషా, సిద్దిఖ్, రసూల్, షరీఫ్, జానీ, గాలిబ్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన హేతుబద్ధంగా నిర్వహించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో సగానికి పైగా బీసీ జనాభా ఉన్నారని అందుకు తగ్గట్టుగా కులగణన హేతుబద్ధంగా వెంటనే నిర్వహించాలని బీసీ జేసీ నాయకుడు లంకా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక యాదవ సంఘ భవనంలో ఆంధ్రప్రదేశ్ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో లంకా వెంకటేశ్వర్లు అధ్యోతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 శాతానికి పైగా ఉన్న బీసీ జనాభా ఉన్నందున బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గీకరణ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సగర సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తాడిశెట్టి గోపిరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పరిధి నుంచి బీసీలను తప్పించాలని, విముక్త జాతులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. దొమ్మర సంక్షేమ సంఘం అధ్యక్షుడు అన్నపురెడ్డి మురళి మాట్లాడుతూ సంచార తెగల విద్యార్థులకు ప్రతి జిల్లాలో రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పాలని కోరారు. గతంలో రజకుల అభివృద్ధిపై చర్చించడానికి కలెక్టర్ అధ్యక్షతన ఉన్న మానిటరింగ్ సెల్‌ను పునరుద్ధరించాలని రజక నాయకుడు లక్ష్మణ్ కుమార్ కోరారు. జంగమ కుల సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జంగమ నాయకుడు మగటం మురళీమోహన్ కోరారు.

భగ్గుమన్న సూరీడు

- నిర్మానుష్యంగా రహదారులు
- ఉదయం తొమ్మిది నుంచే ఎండ తీవ్రత

పెదవేగి: గత వారం రోజులుగా సూర్యుడి ప్రతాపానికి ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఈ వేసవిలో ఇప్పటివరకూ లేని ఎండలు ఇటీవల మండిపోతూ ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 9 గంటకే భానుడి ప్రతాపానికి భయపడి ఇళ్లల్లోకి పరుగులు తీయడంతో గ్రామాల్లోని వీధులన్నీ నిర్మానుషంగా మారుతున్నాయి. ఉపాధి కూలీలు మూటముల్లే సర్దేసి ఇళ్లకు చేరుకుంటున్నారు. వేసవిలో ముమ్మరంగా సాగే గృహ నిర్మాణాల పనులు సైతం సూర్యుడి దెబ్బకు మందగించాయి. పనుల్లో పాల్గొనే కూలీలు, తాపీమేస్త్రీలు 10 గంటలకే చేతులెత్తేస్తున్నారు. గ్రామాల్లోని దుకాణాలన్నీ మధ్యాహ్నం సమయంలో మూతబడుతున్నాయి. ప్రయాణాలు చేసేందుకు ప్రజలు బయటకు రావడం లేదు. ఏకంగా ఉష్ణోగ్రత 45 డిగ్రీలకు చేరింది. మండే ఎండలు, ఉక్కపోతతో వృద్ధులు, పిల్లలు పడుతున్న పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. శీతలపానియాలు, కొబ్బరి బొండాల ధరలు సూర్యుడితో సమానంగా పోటీపడుతున్నాయి. చిరు వ్యాపారులు సైతం ఎండదెబ్బకు మూలనపడ్డాయి. సూర్యుడు అస్తమించేవరకూ పక్షుల జాడ కానరావడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుస్తోంది. సూర్యుడు భగభగలాడిపోతున్న నేపథ్యంలో అత్యవసర మైతే తప్ప ఎండల్లో తిరగరాదని వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే తక్షణమే చికిత్స పొందాలని స్థానిక వైద్యాధికారి మాధవి ప్రజలకు సూచించారు.


నిర్మానుష్యంగా మారిన రహదారులు

కూలీలకు తప్పని పాట్లు....

రెక్కాడితేగానీ డొక్కాడని శ్రమ జీవులు మండుతున్న ఎండలకు విలవిల్లాడిపోతున్నారు. రోజు మొత్తం పనిచేసేందుకు వీలు లేకపోవడంతో ఉదయం పూట పనుల్లోకి వెళ్తున్నారు. వేసవిలో సహజంగా పనులు తక్కువగా ఉంటాయి. మండలంలో భవన నిర్మాణాలు, ఇతర పనులు చేసేవారు, వివిధ కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు ఎండ వేడికి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. పనిచేయకపోతే ఇల్లు గడవని పరిస్థితి. తప్పని పరిస్థితిలో పనులు చేయాల్సివస్తుందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. భవన నిర్మాణ పనులు చేసే తాపీమేస్త్రులు, కూలీలు ఉదయం 6 గంటల నుంచే పనులు ప్రారంభించి త్వరగా ముగిస్తున్నారు. వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు చల్లని పానీయాలతో సేదతీరుతున్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఏమైనా పనులుంటే ఉదయం 10 గంటల్లోపే చేసుకోవాలని, ఆ తర్వాత సాధ్యమైనంత వరకూ బయటకు వెళ్లకపోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తలకు టోపీలు, రుమాలు ధరించాలని స్పష్టం చేస్తున్నారు.


ఎండలో ముసుగులతో వెళ్తున్న మహిళలు